కీర్తనా? - తత్త్వమా?

కీర్తి ప్రతిష్ఠలు అనుమాటలను కొన్ని చోట్ల వినియుందుము. అలాగే తత్త్వజ్ఞానము అనుమాటను కూడ వినియేయుందుము. దీనిని బట్టి కీర్తివేరు, తత్త్వమువేరని సులభముగ తెలియుచున్నది. కీర్తి ప్రపంచ సంబంధమైనది, తత్త్వము పరమాత్మ సంబంధమైనది. ఎందుకనగా! కీర్తి ఎంతగ సంపాదించబడితే అది అంతగ ప్రపంచములోనే నిలిచి పోతుంది. తత్త్వము ఎంతగ తెలియబడితే అంతగ దేవునికి దగ్గర చేస్తుంది. కీర్తి ప్రపంచములో ప్రతిష్ఠింపబడునది, తత్త్వము పరలోకములో వ్యాపించబడునది. ఉదాహరణకు ప్రపంచకీర్తిని సంపాదించిన మహాత్మాగాంధీ మరుజన్మకు పోయాడు, కానీ మోక్షము పొందలేదు. తత్త్వజ్ఞానమును సంపాదించిన జనకమహారాజు పరలోకమునకు పోయాడు, కానీ జన్మకు పోలేదు. చాలామందికి వీటి వివరము తెలియక కీర్తి, తత్త్వముల భేదములను గుర్తించలేకపోవుచున్నారు. అలా వాటి వివరముగానీ, వాటి భేదముగానీ తెలియకపోవడము వలన వాటి ఫలితముల భేదము కూడ తెలియకుండపోయినది. అందువలన వీటి వివరము తెలుసుకోవడము ఎంతైనా మంచిదే.

ఇతరుల ప్రపంచ అవసరాలను ఎవడైతే తీర్చునో, వానిని ఇతరులు పొగడుదురు. అలా వానిని పొగడడమును కీర్తించడము అంటాము. ఒకడు ఇతరులకు ఉపయోగపడడము వలన వాడు కీర్తిని సంపాదించినవాడౌతాడు. ఇతరుల ఆకలికి అన్నము పెట్టడము వలన, దాహమునకు నీరివ్వడము వలన, కట్టుకోవడానికి గుడ్డలివ్వడము వలన, నివశించుటకు ఇల్లు ఇవ్వడమువలన, మిగత అవసరాలకు డబ్బు ఇచ్చుట వలన ఎవడైనగానీ కీర్తిని గడించినవాడవుతాడు. ప్రపంచ అవసరాలను గొప్పగ తలచుచున్న మనిషికి, అటువంటి అవసరాలను తీర్చినవాడు గొప్పవానిగనే కనిపిస్తాడు. ప్రపంచ అవసరాలను గొప్పగ తలువక, వాటికంటే దైవజ్ఞానము గొప్పదని తలచువాడు, దైవజ్ఞానమును అందించిన వానిని గొప్పగ తలచును. దైవజ్ఞాన జిజ్ఞాసపరునికి ప్రపంచకీర్తి గొప్పగ కనిపించదు. ప్రపంచ అవసరాలను తీర్చినవానిని గొప్పగ తలువడు. అతడు జ్ఞానమును అందించిన వానినే గొప్పగ తలచును. దీనినిబట్టి **ప్రపంచకీర్తి, జ్ఞానకీర్తి** అని రెండురకములుగ కీర్తిని విభజించుకోవచ్చును. ఉదాహరణకు దైవజ్ఞానకీర్తిని సంపాదించుకొన్న వారిగ ఎంతోమంది బోధకులను చెప్పుకోవచ్చును. దైవజ్ఞానము కూడ కొందరికి అవసరమే కావున ఆ అవసరమును తీర్చిన బోధకున్ని ఎవరైన కీర్తించుదురు. కీర్తిప్రతిష్ఠవేరు, తత్త్వజ్ఞానమువేరని ముందే చెప్పుకొన్నాము. ఇక్కడ జ్ఞానకీర్తిని పొందిన బోధకునికి ఆత్మజ్ఞానము (తత్త్వజ్ఞానము) తెలియకపోతే అతడు మోక్షమును పొందలేడు. ఈ సూత్రము ప్రకారము దైవజ్ఞానమును చెప్పడములో ఎంతో కీర్తిని సంపాదించిన శంకరాచార్య, రామానుజాచార్య మొదలగు గొప్పవారు సహితము యోగులు కాలేక, మోక్షమును పొందలేక పోయారు. అంత గొప్పవారే మోక్షమును పొందలేకపోతే వారి మార్గమును అనుసరించువారు ఎవరూ మోక్షము పొందలేదనియే చెప్పవచ్చును. ప్రపంచ పనుల కీర్తిగానీ, జ్ఞానకీర్తిగానీ తత్త్వజ్ఞానముకాదు. ఇక్కడ కొందరికొక ప్రశ్నరావచ్చును దైవజ్ఞానమువేరు, తత్త్వజ్ఞానము వేరునా? అని ప్రశ్నించవచ్చును. దానికి మా సమాధానము ఏమనగా! దైవజ్ఞానము తత్త్వజ్ఞానము రెండు ఒకటే. అయితే ఇక్కడ బోధకుల చేత చెప్పబడునది దైవజ్ఞానమని పేరు పెట్టబడిన ప్రకృతిజ్ఞానము. కావున అది దైవజ్ఞానము కానేరదు.

దాహమైన వాడు మంచినీరును కోరుకుంటాడు. ఎవడైన నీరు ఇస్తే వాటిని కొద్దిగ త్రాగుతూనే వారు ఇచ్చినవి మంచినీరా లేక ఉప్పునీరా అని తెలుసుకోగలడు. నీటి విషయము అతనికి తెలుసును కనుక ఎవడైనా ఇవి మంచినీరని చెప్పి ఉప్పునీరు ఇస్తే, వెంటనే ఇవి మంచినీరు కాదు ఉప్పునీరని చెప్పగలడు.

జ్ఞాన జిజ్ఞాసపరుడు దైవజ్ఞానమునే కోరుకుంటాడు. ఎవడైన బోధకుడు జ్ఞానమును అందిస్తే దానిని దైవజ్ఞానమే అనుకుంటాడు. కానీ అది దైవజ్ఞానమా! ప్రకృతిజ్ఞానమా! అని గుర్తించలేడు. ఎందుకనగా అతనికి నీటి వివరము తెలిసినట్లు జ్ఞానము యొక్క వివరము తెలియదు. కనుక ప్రకృతి జ్ఞానమును పరమాత్మ జ్ఞానమని నమ్ముచున్నాడు. ఎక్కడైతే స్త్రీ స్వరూపమును దేవతగ చెప్పుచున్నారో, ఎక్కడైతే మంత్రముల బీజాక్షరములను చెప్పుచున్నారో, ఎక్కడైతే యంత్రముల ప్రతిష్ఠను చెప్పుచున్నారో, ఎక్కడైతే యజ్ఞములను గూర్చి చెప్పుచున్నారో, ఎక్కడైతే బాహ్య ఆరాధనలను బోధించుచున్నారో అక్కడ చెప్పునదంతా ప్రకృతి జ్ఞానమని చాలామంది జ్ఞానజిజ్ఞాసులకు తెలియదు. ఎంతోమంది బోధకులు గురువులవలె చలామణి అగుచు, దైవజ్ఞానమను పేరుతో, ప్రకృతి జ్ఞానమును బోధిస్తున్నారు. అటువంటి బోధలను బోధించి కీర్తి పొందినవారు కీర్తి పరులేగాని తత్త్వజ్ఞానపరులు కారు.

నీటిని, అన్నమును, వస్త్రములను, గృహములను, ధనమును లేని వానికిచ్చి ఆదుకొని పేరు పొందినవారు భూమిమీద ఎందరోగలరు. దానిమిచ్చువాడు తనసొమ్మును అన్యాయముగ సంపాదించి ఆ ధనమును ఇతరులకు ఏ రూపములో ఇచ్చినా అది దానమే అగును. ఏ రూపముగా సంపాదించినప్పటికి ఇతరుల అవసరములకు ఉచితముగ ఇచ్చునది దానమే అగును. అటువంటి దానము వలన కీర్తిరావచ్చును కానీ మోక్షము రాదు. అందువలన భగవద్గీతలో దానము వలన మోక్షము రాదని భగవంతుడు విశ్వరూప సందర్శన యోగమను అధ్యాయములో చెప్పాడు. దుర్మార్గుడు దానమిచ్చినప్పటికి అది వానికి కీర్తినే తెచ్చి పెట్టును. ఒక మంత్రి ఒక బీదవానికి ఉచితముగ ఏది ఇచ్చిన అది దానమే అగును. ఎవరు ఇచ్చారు ఎవరు తీసుకొన్నారన్నది ముఖ్యము కాదు. కానీ దానము ఇచ్చినవానిని తీసుకొన్నవాడు పొగుడును. అలాగే జ్ఞానజిజ్ఞాసపరుడు ఒక బోధకుని వద్ద బోధను విన్నపుడు విన్నవాడు చెప్పినవానిని పొగుడును. కానీ ఇక్కడ విన్నవాడు, బోధించినవాడు చెప్పినది ప్రకృతిజ్ఞానమా! పరమాత్మ జ్ఞానమా! అని చూడడము లేదు. బోధించువాడు జ్ఞానమను పేరుతో ఏది చెప్పిన అది అంతయు దైవజ్ఞానమే అనుకొను స్థితిలో జిజ్ఞాసపరుడు కలడు. అటువంటపుడు ప్రకృతి జ్ఞానము బోధించిన వానికి కూడ కీర్తిప్రతిష్ఠలు వచ్చుచున్నవి. ఇంతవరకు గత కాలములో కీర్తిని సంపాదించుకొన్న వారిని గూర్చి చెప్పుకొన్నాము. బలిచక్రవర్తి దానము చేయుటలో గొప్పవాడని అతనిని నేడు కూడ పొగుడుకొనుచున్నాము. అలాగే కర్ణుడిని కూడ పొగుడుచున్నాము. బలిచక్రవర్తి, కర్ణుడు మొదలగు వారు ప్రపంచసంబంధ దానము చేసి కీర్తిని సంపాదించుకొన్నారు. అలాగే గతకాలములో ఎందరో బోధకులు గురువులవలె ప్రవర్తించి జ్ఞానమును చెప్పి కీర్తి పొందియున్నారు.

ప్రస్తుత కాలములో ధనికుడు వస్తుదానము, బోధకుడు జ్ఞాన దానము చేయుచున్నారు. అంతేకాక ధనికుడు బోధకులకు ధనమిచ్చి వారిచేత జ్ఞానదానము చేయించి తాను జ్ఞానదానము చేసినట్లు తృప్తి పొందుచున్నాడు. అలాగే జ్ఞానము తెలిసిన బోధకుడు కూడ తాను సంపాదించుకొన్న ధనమును వస్తురూపముగ ప్రజలకిచ్చి తాను వస్తు దానము చేసిన తృప్తిని పొందుచున్నాడు. ఉదాహరణకు ఒక బాబా తన చుట్టు ప్రక్కల గ్రామాలలోని ప్రజలకు ఒక పండుగ సందర్భములో క్రొత్త వస్త్రములు, మిఠాయి పొట్లములు, లడ్డు ఉండలు పంచాడను కుందాము. అది ఒక బోధకుడు చేసిన వస్తుదానమగును. అలాగే ఒక ఊరిలోని ధనికుడు తనచుట్టు ప్రక్క గ్రామాలవారందరు వచ్చి జ్ఞానమును వినునట్లు ఒక స్వామీజీని ఆహ్వానించి అతనిచేత జ్ఞానమును చెప్పించాడనుకొందాము. అది ఒక ధనికుడు చేసిన జ్ఞానదానమగును. ఈ విధముగ

ధనికులు వస్తుదానము, జ్ఞానదానము రెండు చేయుచుండగ, కొందరు బోధకులు జ్ఞానదానము, వస్తుదానము చేయుచున్నారు. ఇదంతయు కీర్తికి సంబంధించినదే అగును కానీ తత్త్వజ్ఞానము (ఆత్మజ్ఞానము)నకు సంబంధించినది కాదు.

తత్త్వజ్ఞానమనగా ఏమిటి? అని ప్రశ్నవస్తే ఆత్మను గురించి తెలుసుకోవడమే ఆత్మజ్ఞానము లేక తత్త్వజ్ఞానము అంటాము. ఇంతవరకు అద్వైతములోగానీ, విశిష్టాద్వైతములోగానీ, ద్వైతములోగానీ ఆత్మను గురించిన ప్రస్తావనరాలేదు. అందువలన ఆదిశంకరాచార్యులకుగానీ, రామానుజాచార్యులకు గానీ, మద్వాచార్యులకు గానీ ఆత్మజ్ఞానము తెలియదన్నాము. మా మాటలోని సత్యమును తెలియలేక మా మాటను కొందరు అసత్యముగ లెక్కించుకొనినప్పటికి మేము చెప్పుమాట ముమ్మాటికీ సత్యము. దాగిఉండి ఇప్పుడిప్పుడే బయటికి వచ్చిన ఒక్క **త్రైతసిద్ధాంతము**లో తప్ప ఆత్మజ్ఞానము మరి ఎక్కడలేదు. **త్రైతసిద్ధాంత ఆదికర్త అయిన శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల నుండి చెప్పబడిన త్రైతసిద్ధాంతములో ఆత్మంటే ఏమిటో తెలియబడినది.** అద్వైతసిద్ధాంతి అయిన ఆదిశంకరాచార్యుడు పరమాత్మను గూర్చి చెప్పాడు. విశిష్టాద్వైత సిద్ధాంతి అయిన రామానుజాచార్యుడు ప్రకృతికంటే విశిష్టమైనది పరమాత్మ అని చెప్పాడు. ద్వైతసిద్ధాంతి అయిన మద్వాచార్యుడు జీవాత్మను, పరమాత్మను గురించి చెప్పాడు. కానీ ఆత్మను గురించి ప్రబోధాచార్యుడు మాత్రము తన త్రైతసిద్ధాంతములో తెలియజేశాడు. అందువలన ఆత్మజ్ఞానము ఎవరికి తెలియదనినాము.

ఇంతవరకు కీర్తిని గురించి, తత్త్వజ్ఞానమును గురించి తెలుసుకొన్నాము. ధనమున్న ధనికులు కీర్తిని సంపాదించుకొనినా పరవాలేదు. కానీ జ్ఞానధనమున్న బోధకుడు ప్రపంచకీర్తిని సంపాదించుకోవడము మంచిదికాదు. ధనికులు ప్రపంచసేవలో భాగమైన దానములు చేయవచ్చును. కానీ బోధకులు దైవసేవలో భాగమైన తత్త్వజ్ఞానమునే బోధించవలెను. ప్రపంచములో ఉపయోగపడు ధన, వస్తు, వస్త్ర, వాహన, కనకములిచ్చినా అవి భూమిమీద కొంతకాలము ఆ జన్మలో మాత్రము ఉపయోగపడును. ఒక్క ఆత్మజ్ఞానము మాత్రము మరుజన్మకు కూడ వెంటవచ్చును, శాశ్వతముగ ఉపయోగపడును. అందువలన ఒక స్వామిజీ దైవజ్ఞానమునకు సంబంధించిన పుస్తకములను అజ్ఞాన ప్రజలకు పంచినా అది సమర్థనీయమైన పనియగును. అలాకాక ధనికునివలె అనేక గ్రామాలకు నీటి సౌకర్యము కల్గించినా, కొన్ని వేలమందికి నిత్యాన్నదానము చేయించినా, పండుగల సందర్భములో వస్త్రదానము, మిఠాయి దానము చేసినా అది అసమర్థనీయమైన పనియే అగును. ఇవన్నీ ధనికులు గానీ, ప్రభుత్వములుగాని చేయవలసిన పనిగానీ స్వామిజీలు చేయవలసిన పనికాదు. మానవునిలో పాపభీతిని కల్గించి, పాపములను చేయకుండ చేసి తత్త్వజ్ఞానమును తెలియునట్లు చేయడము. స్వామిజీలు, బాబాలు చేయవలసిన పని. చాకలి పని చాకలి, మంగళి పని మంగళి చేస్తే బాగుండును. అలాకాక చాకలిపని మంగళి, మంగళిపని చాకలి చేస్తే అది వృత్తికాదని ఎలాగ అందుమో, అలాగే స్వామిజీలు దానములు ఇవ్వడము, ధనికులు జ్ఞానము బోధించడము గాడితప్పిన పనియగును.

విద్యగాని, వైద్యముగానీ, కూడుగాని, గుడ్డగాని మానవునికి బాహ్య ప్రపంచములో అవసరమైనవన్ని కర్మను బట్టి ముందే నిర్ణయించబడియుండును. కేవలము ఒక్క దైవజ్ఞానము మాత్రము కర్మకు అతీతమై యుండును. కర్మకు అతీతమైన జ్ఞానమును అందివ్వడము బోధకుల (స్వామిజీల) పనిగ ఉండవలెను. విద్య, వైద్య, కూడు, గుడ్డ అన్ని కర్మాధీనమై ఎవరికి ఎంత లభించవలెనో అంతే లభించునట్లు ముందే అమరికయుండును. ఏ సమయమునకు ఏది లభించవలెనో అది ఎవరి ద్వారానైన లభించును. కాని

జ్ఞానము ఒక్క జ్ఞానుల ద్వారానే లభించును. అందువలన జ్ఞానులు ప్రపంచ సహాయములను చేయక పరమాత్మ జ్ఞానమును అందివ్వవలసియున్నది. ఒక సందర్భములో కొందరు మమ్ములను ఈ విషయమై ప్రశ్నిస్తూ మీరు సమాజసేవ ఏమి చేస్తున్నారని అడిగారు. అపుడు మేము **"జ్ఞానసేవ తప్ప మనుషుల సేవ ఏమి చేయము". మనుషులకు సేవ చేయుటకు ప్రభుత్వములున్నవి, ధనికులున్నారు. ప్రభుత్వములు మేమున్నది మీకొరకే అంటున్నపుడు, ఎన్నో రంగములు ఏర్పరచి వాటిద్వార మనుషులను పరిపాలిస్తున్నపుడు ఏదైన తక్కువైతే ప్రభుత్వములను అడుగవలెను. అట్లే మీరు స్వచ్ఛమైన జ్ఞానమును అందివ్వమని మమ్ములనడుగవలెను అని చెప్పాము.** నేడు చాలామంది స్వామిజీలు ప్రపంచకీర్తిని సంపాదించుకొనుటకు, తాము సంపాదించుకొన్న ధనమును ఇతరుల అవసరములకు ఖర్చు చేయుచు ఖ్యాతిని పొందుచున్నారు. మొదట ఏదో ఒక విధముగ తమ పలుకుబడితోనో, మహత్యముతోనో ధనికులవద్ద నుండి ధనమును సంపాదించి ఆ ధనమును ఉపయోగించి వైద్యశాలలు, విద్యాలయములు, నిత్యాన్నదానములు వగైరా వగైరా నెలకొల్పుచు ఉచిత విద్య, ఉచిత వైద్యము, ఉచిత భోజనము అని ప్రచారము చేసుకొని కీర్తిని గడిస్తున్నారు.

ఈ విధముగ చాలామంది స్వామిజీలు ప్రపంచ సహాయములను అందరికి తెలియునట్లు చేయడమేకాక, తాము స్వాములైనందుకు మేము జ్ఞానమును కూడ తెల్పుచున్నామని పెద్ద పెద్ద సభలను నిర్వహించి అక్కడ జ్ఞానబోధ అను పేరుపెట్టి బోధలు చెప్పుచుందురు. అక్కడి ప్రవచనములలో గతములో కీర్తి గడించిన వారిని గూర్చి చెప్పుకోవడము జరుగుచుండును. గతములోని వారి గొప్పతనమును గూర్చి చెప్పుకోవడమే కాక, వారి పేరుమీద పాటలను సృష్ఠించుకొని ఆ పాటలలో వారి గొప్పతనమును కీర్తించుచుందురు. ఇలా చాలామంది స్వాములు తమకు తెలిసిన తత్త్వబోధ (ఆత్మబోధ) చెప్పక, తమకంటే ముందు పుట్టి చచ్చిపోయిన స్వాముల గురించి, వారి మహత్యముల గురించి, వారి జీవితచరిత్రలు గురించి, వారు చెప్పిన జ్ఞానము గురించి కొంత మాటల రూపములో, కొంత పాటలరూపములో చెప్పుచుందురు. చివరివరకు వారి బోధలు విన్నప్పటికి అందులో కీర్తన తప్ప ఆత్మజ్ఞానము ఏమాత్రముండదు. మరికొందరు స్వాములైతే ఏకంగ పాటకచ్చేరిలాగ అన్ని వాయిధ్యములతో పాటలేపాడుచుందురు. వినేవారు తలలూపుతుంటే, ఆనందముగ వింటూవుంటే, చెప్పేవారు అదే జ్ఞానమన్నట్లు చెప్పుచుందురు. నీ నామమువింటే కర్మలు పోతాయి, నీ దర్శనము దొరికితే జన్మలు పోతాయి అని ఒక స్వామిజీ పాడితే, మరొకరు ఓ గాయీనాథా నిను మించిన దైవము లేదు, నీ స్పర్శతో మా రోగాలు పోతాయి, నీ చూపుతో మాకు లాభాలు వస్తాయి అని పాడుచుందురు. ఒకరు పురాణాల కథలను చెప్పితే, మరొకరు పుణ్యక్షేత్రాల కథలను చెప్పుచున్నారు. ఒకరు భారత రామాయణ గాథలను నెమరువేస్తు చెప్పుచుంటే, మరొకరు దేవతల మహాత్యాలను గురించి చెప్పుచుందురు. ఇష్టదేవతలను గురించి కొందరు చెప్పితే, ఇష్టాలను తీర్చి కష్టాలను లేకుండ చేయు దేవతలను గూర్చి కొందరు చెప్పుచుందురు. ఈ విధముగ అనేక విధముల బోధలను నేటి స్వామిజీలు కొనసాగిస్తున్నారు. వాటినన్నిటిని పరిశీలిస్తే ఆత్మను గురించిన జ్ఞానముగాని, జీవాత్మను గురించిన జ్ఞానము గానీ, పరమాత్మను గురించిన జ్ఞానముగాని ఏమాత్రముండదు. అటువంటపుడు స్వామిజీలు చెప్పు జ్ఞానము దైవజ్ఞానము కాదా? అంటే ఏమాత్రము కాదనియే చెప్పాలి. వారు చెప్పునదంతా ప్రకృతి జ్ఞానమనియే చెప్పాలి. ఇతరుల కీర్తిని గురించి చెప్పునది కావున వారు చెప్పునది ఇతరుల కీర్తియనీ, వారు పాడు పాటలన్ని కీర్తనలని తెలియుచున్నది. ఎక్కడైన ఆత్మజ్ఞానమునకు సంబంధించిన భగవద్గీత ఏ స్వామిజీ అయిన చెప్పుచున్నాడంటే ఆ ఉపన్యాసములో

కృష్ణుడు చెప్పిన జ్ఞానమే ఉన్నప్పటికి ఆ స్వామిజీ మాటలలో జీవాత్మ ఉంటుంది, పరమాత్మ ఉంటుంది. కానీ మధ్యలోని ఆత్మమాత్రముండదు. ఆత్మయొక్క ప్రస్తావనే లేనపుడు అక్కడ చెప్పబడునది పరమాత్మ జ్ఞానముకావచ్చు, జీవాత్మ జ్ఞానముకావచ్చు కానీ ఆత్మజ్ఞానము మాత్రముకాదని స్పష్టముగ చెప్పవచ్చును. ఈ విధముగ భగవద్గీతోపన్యాసములలో కూడ ఆత్మను లేకుండ చేయుచున్నారు. భవిష్యత్తులో ఆత్మను మరచిపోతారే మోనని పూర్వము పెద్దలు ఊహించినవారై అలా మరువకుండుటకు ఆత్మకు సంబంధించిన ఎన్నో వాక్యములను మన మధ్యలో ఉంచారు. అలా ఉంచిన వాక్యములు **ఆత్మహత్య అని, ఆత్మబోధయని, ఆత్మబలమని, ఆత్మచైతన్యమని, ఆత్మగమనమని, ఆత్మసాక్షి, ఆత్మబంధువు, ఆత్మాభిమానము, ఆత్మశక్తి, ఆత్మవిశ్వాసము, ఆత్మవిమర్శ, ఆత్మజ్ఞానమని, ఆత్మతేజమని** చెప్పడమేకాక భగవద్గీతలోని శ్లోకములలో **ఆత్మ** అను పదమునే ఉపయోగించారు. అయినప్పటికి నేటి మానవుడు స్వామిజీగా మారినప్పటికి ఆత్మను గురించి తెలుసుకోక అన్యులను కీర్తించడము, అన్యదేవతలను ఆరాధించడము చేయుచు తాను స్వయముగ కీర్తిని సంపాదించు కొనుటకు ప్రపంచసంబంధ సహాయక కార్యములు చేయుచున్నాడు. అందువలన ప్రతి మనిషి మాన్యుడు కానీ సామాణ్యుడు కానీ నేను ఇంకొరిని కీర్తించుచున్నానా? నేను కీర్తిని సంపాదించుకొనుచున్నానా? అని ప్రశ్నించుకొని యోచించి, అలాకాకుండ నేను ఆత్మజ్ఞానమును తెలుసుకొనుచున్నానా? ఇతరులకు ఆత్మజ్ఞామును తెలుపుచున్నానా? అని చూచుకోవలసియున్నది. అందువలన మనిషి తన జీవితములో పుణ్యమును సంపాదించు కీర్తిని వదలి, మోక్షమును తెచ్చిపెట్టు ఆత్మజ్ఞానమును (తత్త్వజ్ఞానమును) తెలుసుకొనుటకు అవకాశమేర్పడును.